


# ఋణానుబంధం

ఫిల్కానా అప్పారావు

కథానిక

చాలీ చాలని గోనెకటి దగ్గరగా కప్పుకొని చలిగాలికి వణికిపోతూ, చెట్టుక్రింద ముడుచుకుని పడుకున్న వెంకడు 'అబ్బా' అంటూ బాధగా మాటిమాటికి మూల్గుతున్నాడు. రాత్రిపూట ప్రతి రోజూ యిలా మూల్గడం వెంకడికి పరిపాటే. కాని యీనాటి మూల్గులో ఏదో అవ్యక్తమైన బాధ, యిక యెన్నాళ్ళకీ మాసిపోని ఆక్రందన స్పష్టంగా గోచరిస్తున్నది. ప్రతిరోజూ తిండిలేకపోవడంవల్ల ఎండిపోయిన కండరాలు రాపిడిచేసుకున్న శబ్దం పైకిమూల్గుద్వారా వినవచ్చేది. కాని యీ నాడు ఆ మూల్గు హృదయ కుహరంలోంచి బాధగా, గుండెను చీల్చేస్తూ పైకి వస్తున్నది. అతనితో యిన్నాళ్ళుగా వుంటున్న తోడునీడ, అతని కష్టాన్నీ, సుఖాన్నీ పంచుకున్న ప్రియబంధువు, ప్రపంచంలో నీకెవరయినా బంధువులున్నారా - అంటే, గర్వంగా - "నాకు మీలాంటి బంధు వుంది" అని చెప్పదగు ఒక ఆశాజీవి, తన రంగి తనకోసం ప్రాణంవదలి, క్రిందటిరోజున యీలోకంలోంచి యేదో తెలియని యింకో లోకంలోనికి, క్రూరంగా, అమానుషంగా, తరిమి వేయబడింది. యిన్నాళ్లుగా వుంటున్న వెలుగు ఒక్కసారి మాయమయింది. వెంకడికి 'రంగి' చనిపోగానే ప్రపంచమంతా శూన్యంగా కన్పడింది. "తనూ తనరంగితో చచ్చిపోయివుంటే ఎంతో బాగుండేది" అని అనుకున్నాడు వెంకడు. కాని భగవంతుడికే అతనిమీద ఇంకా దయ కల్గదు. చలిగాలి జోరుగా వీస్తున్నది. గుండెవేగంగా, బరువుగా కొట్టుకుంటున్నది. అబ్బా! యీ నాడు రోజూకన్న బాధ మరీ ఎక్కువగా వుంది. వుండదు మరీ! లోకంలో అతడ్ని ప్రేమించే ఏకైకజీవి, అతని కోసం ప్రాణాలర్పించి, యీ లోకంలోంచి, మరెన్నటికీ కన్పడకుండా నిష్క్రమిస్తే బాధని పించదూ? హృదయం ముక్కలు ముక్కలయి నెత్తురు కక్కదూ? 'రంగీ' అంటూ పెద్దగా అరచి, పడుకున్న వాడల్లా లేచిపోయేడు. తనరంగి చచ్చిపోతున్నప్పుడు గిలగిలకొట్టుకుంటూ అబ్బా - ఆదృశ్యం మరచిపోదామన్నా మరువలేకున్నాడు. ఆ దృశ్యం జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా యినుప చేతులతో హృదయం చీల్చివేస్తున్నట్లు బాధపడుతున్నాడు.

రంగికి, తనకి స్నేహం లేకపోయినట్టయితే తన కింత హృదయపరితాపముండేదికాదు. అసలు రంగి యిలా అమానుషంగా, హింసాస్పదంగా చనిపోయేదేకాదు. రంగి చావుకి తనే కారణం. రంగి తన వల్లే చచ్చిపోయింది. రంగీ క్షమించు అన్నాడు గట్టిగా వెక్కివెక్కి ఏడుస్తూ-కాని ఆ నిశ్శబ్ద వాతావరణంలో అతనినెవరూ ఓదార్చేవారు లేకపోయేరు. వెంకడ్ని చూసి నవ్వుతున్నట్లు నక్షత్రాలుమాత్రంమిణుకు మిణుకు మంటున్నాయి.

వెంకడికి, తల్లితండ్రులెవరో తెలీదు. వెంకడికి తెలిసిందల్లా ఒక ముసలమ్మ. ఆ ముసలమ్మ దగ్గరే వెంకడు పెరిగేడు. ఒకనాడు ఆ ముసలమ్మ వెంకడికి చెప్పింది- "నువ్వు పుట్టగానే నీ బాబు నీయమ్మనొదిలేసి ఎక్కడికో వెళ్ళిపోయేడు. తరువాత నీయమ్మకి జబ్బువచ్చి చచ్చిపోయింది. నువ్వు దిక్కులేనివాడ

వయిపోయేవు. నా ముసలికాలంలో ఛేదోడు వాదోడుగా వుంటావని నిన్ను నే చేరదీసేను." ముసలమ్మ యీ విషయం చెప్పేవరకూ తల్లీ తండ్రీ, వుండేవారని వెంకడికి తెలియదు.

వెంకడు ముసలమ్మ కలిసి ఊరంతా తిరిగి బిక్షాటన చేసేవారు. వచ్చిన బియ్యంతో ఏ చెట్టుక్రిందో వండుకొని తినేవారు ఒకనాడు కడుపునిండా అన్నం దొరికితే మరొకనాడు సగం కడుపే నిండేది. వేరొకనాడు అదీ వుండేది కాదు. కాని అన్నిటికీ వెంకడు ముసల్ది అలవడి పోయేరు. ఇలా కొంతకాలం జరిగిపోయింది. వెంకడికి పన్నెండుసంవత్సరాలొచ్చేసరికి ముసలమ్మ ఒకనాడు అమాంతం బస్సుక్రిందపడి చచ్చిపోయింది. వెంకడు ఆనాటినుంచి దిక్కులేనిపక్షి అయిపోయేడు. వెంకడు తనంతట తానే తిరిగి భిక్షాటన చెయ్యవలసివచ్చింది. మొదట్లో కొంచెం కష్టం అనిపించినా క్రమేణ అతని కలవాటయిపోయింది.

కాలవాహినిలో కొన్ని సంవత్సరాలు కల్సిపోయేయి. వెంకడు ఏదో యిలా మనిషిగా బ్రతుకుతున్నాడంటే అదికూడా ఆ భగవంతుడి కిష్టంలేకపోయింది. వెంకడికి తెలీకుండానే అతని వంట్లో యెన్నడో బయలుదేరిన రోగం ఇప్పుడు స్పష్టంగా పైకి కన్పడసాగింది. దేహమంతా వికృతంగా తయారయింది, అసలకే వెంకడు చాలా వికృతమయిన మనిషి. కొత్తగా వుదయించిన ఈ రోగంవల్ల మనిషి మరీ వికృతంగా తయారయినాడు. అతనిలో వోపికకూడా బాగా తగ్గిపోయింది. రెండువీధులు తిరిగేసరికే బాగా అలసిపోయేవాడు. బాగా అలసిపోయి, తిరగలేని రోజు ఏ చెట్టుక్రిందో అలా కాలేకడుపుతో పడుండేవాడు.

వెంకడ్ని చూచేసరికి ప్రతివాడు అసహ్యించుకొనేవాడు. బిచ్చమెత్తుకుందికి యెవరింటికయినా వెళ్తే కసిరికొట్టేవారు. "మళ్ళీ యీ గుమ్మంగాని తొక్కినట్టయితే కాళ్ళు విరగగొడతా- రోగిష్టి వెధవా పో-" అంటూ తిట్లవర్షం కురిపించేవారు.

వెంకడికేమీ అర్థంకాలేదు. తనకి కురుపులయినంతమాత్రాన్నా అందరూ తనని అసహ్యించుకోవాలా? అని అనుకున్నాడు. అందుకే తన జట్టువాడ్ని అడిగేడు—"ఒరే, అడుక్కుందికి వెళ్తే ఎవ్వరూ నన్ను గుమ్మం ఎక్కనివ్వడం లేదురా. రోగిష్టి పోడినని చెడతిడుతున్నారు. కురుపు లయినంతమాత్రాన్నా నే రోగిష్టి పోడినెలా అవుతానురా?" అన్నాడు అమాయంగా.

"ఇవి కురుపులు కాదురా పెద్దరోగం ఇది అంటుకుంటుందన్నభయం కొద్దీ ఎవ్వరూ నిన్ను దగ్గరకు రానివ్వడంలేదు" అన్నాడు అతనిజట్టోడు.

"పెద్దరోగం మరి తగ్గదేమిట్రా" అన్నాడు కళ్ళల్లో ఆత్రుతను కనబరుస్తున్న వెంకడు.

"డబ్బులేని మనలాంటివాళ్ళకి వచ్చిందంటే యేరోగం తగ్గదురా. అయినా మన వూళ్ళో ధర్మాసుపత్రి వుందిగా ఒకసారి యెళ్ళ కట్లు కడతారేమో బాధయినా కొంచెం తగ్గుతుంది" అని సలహా యిచ్చాడు.

మర్నాడు యెంతో ఆశతో ధర్మాసుపత్రికి వెళ్ళిన వెంకడు నిరాశతో తిరిగి వచ్చేడు. "ముష్టి వెధవలకికూడా మందు కావాలా? ఫో-ఫో-" అని డాక్టరు వెంకడ్ని "ఆయా"చేత ఆసుపత్రి నుంచి పైకి గెంటించేశాడు.

వెంకడుకి యెలా బ్రతకాలో అర్థంకాలేదు. ఎక్కడా పిడికెడు మెతుకులుకూడా దొరకడం లేదు. దాహం వేసినప్పుడు కడుపునిండా మంచి నీళ్లుకూడా కరువయేయి. ఒకనాడు దాహం కొద్దీ చెరువుదగ్గరకి వెడితే అక్కడున్న కాపలావాడు కర్రతో తన్ని పంపించేడు. మళ్ళీ ఆ పరిసర ప్రాంతంలో కన్పడితే కాళ్లు విరిచేస్తానని హెచ్చరించేడు ఆనాటినుంచి, దాహంవేసినా వెంకడు చెరువుదగ్గరకికూడా వెళ్లడం మానేసేడు, అతని జట్టువాళ్ళు చాలా మంచివాళ్ళు. కొన్నాళ్ళు వాళ్లకున్నదాంట్లో కొంత అన్నం పెట్టేవారు. కాని యెన్నాళ్ళో అలా పెట్టలేకపోయారు. దాహం వేసినప్పుడు లేదనకుండా నీళ్ళుమాత్రం యిచ్చేవారు.

ఒకనాడు మామూలుగా వెంకడు కాలే కడుపుతో వూరావల నున్న ఆ చెట్టుక్రింద కూర్చున్నాడు. చెట్టుకి కొంచెం దూరంలో ఒకపెద్ద భవనం వుంది. ఆ భవనం దగ్గిర చెత్త పారేసే కుండీ ఉంది. ఆ కుండీ దగ్గిర ఒక కుక్క ఎంతో సేపటినుంచి వేచివుంది. ఆనాడు, ఏనాడు గుర్తిం

చని యీ దృశ్యాన్ని వెంకడికళ్లు బాగా గుర్తించినయ్. పదకొండు గంటలయేసరికల్లా ఆ భవనపు ప్రహరీ గోడమీంచి ఎంగిలాకులు చెత్తకుండీలో పడినయ్. ఆ ఎంగిలాకులుకోసమే అంతవరకూ కాచుకొనివున్న కుక్క ఒక్కసారిగా చెత్తకుండీలోకి దుమికి ఎంగిలాకులను నాకుతున్నది. ఎంగిలాకులను చూచేసరికి వెంకడికి లేనిశక్తి వచ్చింది. యింతట్లో కుక్క కూడా వచ్చింది. కాని వెంకడ్ని చూచి భయపడి చెత్తకుండీ దగ్గరకు రాలేకపోయినది. ఇంతలోకే గోడమీంచి ఎంగిలాకులు పడినయ్. కుక్క ఒక్కసారిగా చెత్తకుండీలో వురకబోయింది. కాని కుక్కకన్నా వెంకడు ముందురికేడు. ఎన్నాళ్ళనుంచో తిండిలేని వెంకడు ఆత్రుతతో ఆకులన్నీ నాకేశాడు. అసహాయంరాలైన కుక్క, తన ఆహారం వెంకడు తినేస్తున్నాడన్న ద్వేషంకొద్దీ అరవడం తప్ప మరేమీ చెయ్యలేకపోయింది. ఆకులన్నీ నాకడమయినతర్వాత కుక్కవేపొకసారి చూచేడు. అంతవరకు దూరంగా వుంటున్న కుక్క, ధైర్యం చేసుకొని, ఆకులమీద కలియబడింది. కాని ఒక మెతుకు కూడా దానికి లభించలేదు. ఆకులన్నీ, ఇటూ అటూ తిరగవేసి వెంకడివేపు అసహాయంగా చూచి, అక్కడనుంచి వెళ్ళిపోయింగా కుక్క. ఇన్నాళ్ళకు మళ్ళీ తను 'అన్నం' తిన్నాడు అనే సంతోషంతో వెంకడు ఆ చెట్టుక్రింద కొచ్చాడు. కాని అతని సంతోషం ఎంతసేపు వుండలేకపోయింది. 'తను ఆ కుక్క ఆహారం తినేసేడు. అది ఎంత ఆకలితో వెళ్ళిపోయిందో' అని అతని హృదయం బాధపడసాగింది. "ఈ వేళ యేదో ఆకలికొద్దీ అంతా తినేశాను. రేపు నేను తిన్నదాంట్లోనే కొంత కుక్కకి యిచ్చేస్తాను" అని నిర్ణయం చేసుకొని తన హృదయబాధ కొంత తగ్గించుకున్నాడు.

ప్రతిదినం యిద్దరూ ఎంగిలాకులు పడే వేళకి హాజరయేవారు. ఇద్దరూ పంచుకుని తినేవారు. తర్వాత చెట్టుక్రిందకి యిద్దరూ చేరేవారు కొంతసేపు సేద తీర్చుకున్న తర్వాత, కుక్క వెళ్లిపోయేది ఇలా కొన్నాళ్లు గడిచిపోయేయి. యిద్దరిమధ్య బాగా స్నేహం ఏర్పడింది. కుక్క వచ్చేవరకూ ఎంగిలాకులు పడినా, వెంకడు తినేవాడు కాడు. కుక్క వచ్చిన తర్వాతనే యిద్దరూ పంచుకుని తినేవారు. ఒకరికన్న ఒకరు ముందొచ్చి, ఆహారం కాజెయ్యాలి అని ద్వేషభావం యిద్దరిలోను పోయింది. ఒకరంటే ఒకరికి, ప్రేమ, అభిమానం, జనించింది. చెట్టుక్రింద, వెంకడిదగ్గరకి వచ్చి, కుక్క కూర్చునేది. వెంకడు అప్యాయంగా దాని వళ్ళంతా ఎంతో ప్రేమతో నిమిరేవాడు. దానికి "రంగి" అని ముద్దుపేరు పెట్టేడు. "రంగీ" అని పిల్చేసరికి యెక్కడున్నా వెంకడిదగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చేది. రాత్రిళ్లు ఎంత 'చలి'గా నున్న సరే చెట్టుక్రింది వెంకడు దగ్గిరే వచ్చి పడుకునేది. వెంకడు దానిమీద చెయ్యివేసి, వళ్ళు నిమురుతూ, తన బాధంతా మరిచిపోయి హాయిగా నిద్రపోయేవాడు.

కొద్దికాలమయినతర్వాత చెత్తలకుండీలో ఎంగిలాకలు పడ్డం మానేసేయి. స్నేహితులిద్దరికీ ఆహారం కరువయింది. ఆ భవనంలో వున్నవాళ్లందరూ ఎక్కడికో పనిమీద వెళ్లిపోయేరని, మరి కొంతకాలంవరకూ తిరిగిరారని, అక్కడ భోగాట్టా చెయ్యగా వెంకడికి తెలిసింది. ఎన్నో దినాలు గడిచిపోయినా ఆ ఇంట్లోనారెవరూ రానేలేదు. అయినా మిత్రులిద్దరూ విసిపోలేదు. ఆ చెట్టుక్రిందే ఎంత ఆకలితోనయినాసరే అలాకూర్చుండేవారు.

ఒకనాడు బాగా ఆకలివేస్తూవుంటే ఎక్కడయినా పిడికెడు మెతుకులు దొరుకుతాయేమోనని ఆశకొద్దీ వెంకడు అలా వీధులలోకి బయలుదేరేడు... వెంకడు, రంగీ, ఎన్నివీధులు తిరిగినా లాభంలేకపోయింది. వెంకడి కడుపు ఆకలితో దహించుకపోతున్నది. ఆకలికొద్ది వెంకడు యజమాని పొమ్మంటున్నా వినకుండా పదేపదే ఒక గుమ్మంముందు నిలబడి అడిగేడు. ఎంత చెప్పినా వెంకడు వినడంలేదని కోపంవచ్చిన ఆ యింటి యజమాని తనచేతిలోనున్న కర్ర వెంకడిమీద విసిరేడు. ఆ కర్ర వెంకడితలకి తగిలి నెత్తురు ధారలుగా కార్చింది. అసలే తిండిలేక కృశించివున్న వెంకడు స్పృహతప్పి పడిపోయేడు. ప్రక్కనేవున్న 'రంగి' తన యజమానికి జరిగిన పరాభవాన్ని చూడలేక పోయింది. కోపంకొద్దీ ఆ ఇంటి యజమాని పైకురికి అతని కాలు కొరికింది. ఇంటియజమాని 'కుయ్యో, మొర్రో' అని అరవగా

నలుగురు చేరి రంగిని కర్రలతో చావబాదేరు. ఎన్ని దెబ్బలు కొడుతున్నా రంగి తన యజమానిని వదలకుండా అక్కడేవుంది ఆఖరికి గట్టిదెబ్బ తగిలిన రంగి - అరుస్తూ - నేలమీద పడిపోయింది. రంగి అలా అరుస్తూనే వుంది - వెంకడికి తెలివచ్చింది. రంగి అరుస్తూనే, బాధపడుతూనే, వెంకడివేపు చూచింది. వెంకడు రంగిని తన వడిలోకి తీసుకున్నాడు. కొంతసేపు రంగి గిలగిల కొట్టుకుంది - నోటరక్తం కక్కింది. వెంకడివేపు బాధగా చూచింది-అంతే, శాశ్వతంగా యీ లోకంలోంచి, వెళ్ళిపోయింది. 'రంగి' అంటూ వెంకడు భోరుమని ఏడ్చేడు.

మర్నాడు వుదయం రంగిని, వెంకడ్ని మునిసిపాలిటీ చెత్తలబండి వేరుచేసింది.

రంగి చనిపోయిన దగ్గిరనుంచి వెంకడు ఏడుస్తూనే వున్నాడు. అంధకారంలో మెరపు మెరసినట్టు ఆశాజీవిలా రంగి కనపడి మాయమయింది. రంగిని మరచిపోదామన్నా మరవలేకున్నాడు వెంకడు. అతని శరీరంలో హృదయం కూడా ఒక మానని గాయంగా తయారయింది.

# రమణీ ప్రియదూతిక

యస్వీ జోగారావు

రావే రమణీ ప్రియదూతిక!
భావజు వైతాళిక గీతిక!
భవదాగమనాశా భజనిక
    నా మనసిక నవసిపోక-
నా చింతా నిరంతర
    చిరంతన నిరీక్షణ
    కంతరాయ మాప్యాయముగా-
మా కులపతి జగదేక
    మహాకవి శ్లోకమువలె-
(నా కూరిమి మా లోకము
    కాక్‌టెయిల్ మైకమువలె)
నా యెండిన యెడద చదల
    పాడగట్టిన మొగిలు పగిది-
(నా కోర్కెల కేటలాగు
    పై కాపీరైటు పగిది)
రావే రమణీ ప్రియదూతిక!
భావజు వైతాళిక గీతిక!
మరలమరల పరామర్శ
        లెందులకే!

మరువలేనా
రసవిస్మృమర స్వరభాసుర రాగరుచిర
హృదయగాత్ర రూపములవి
లలితకళా ఫలశ్రుతులు!
నా కవితావ్రత దీక్షా శుభాక్షతలు!
రావే రమణీ ప్రియదూతిక!
భావజు వైతాళిక గీతిక!